క్లుప్తంగా

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్): స్థానిక జిల్లా కోర్టులోని న్యాయ సేవాధికార సంస్థ ప్రాంగణంలో ఆటో డ్రైవర్లకు రవాణా వ్యవస్థలో ఎదురయ్యే ఇబ్బందులపై బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు, శాశ్వత లోక్ అదాలత్ ప్రజాప్రయోజన సేవల అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్, ఆర్టీఓ రమేష్ ఆటో డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల జారీలో ఎదురవుతున్న సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలనే విషయాలను తెలియజేశారు. అలాగే 18 ఏళ్లు నిండిన వారికి డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కచ్చితంగా ఉండాలని, లేని వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ అధికారులు పాల్గొన్నారు.

నేడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి

కర్నూలు కల్చరల్: స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 177వ వర్ధంతిని కర్నూలు ఏక్యాంప్‌లోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్కిల్‌లో గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు వి.విజయ మోహన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జి.సృజన, ప్రజాప్రతిధులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో పతకాలు

కర్నూలు (టౌన్): రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈనెల 18న నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పతకాలు సాధించారు. వీరిలో కర్నూలుకు చెందిన డి.మేఘనాథ్‌రెడ్డి, శాన్వి, బాలాజీరెడ్డి, రాహుల్, వెంకటేష్, జస్విత్, రామ్‌స్వరూప్, దీరజ్, వైష్ణవ్, సచిన్, మనోహర్, మేఘనలు ఉన్నారు. సినీ హీరో సుమన్ వారికి పతకాలు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కరాటే సంఘం అధ్యక్షుడు కోలా ప్రతాప్ పాల్గొన్నారు.

24న విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

కర్నూలు కల్చరల్: కర్నూలు ఓల్డ్ సిటీలోని అంబా భవాని ఆలయంలో ఈనెల 24వ తేదీ ఉద యం 11 గంటలకు విగ్రహ ప్రతిష్ట మహోత్స వం జరుగుతుందని ఆలయ కమిటీ ప్రతినిధు లు తెలిపారు. గణపతి, సీతారామ లక్ష్మణ, ఆంజనేయ, శివపార్వతులు, నందీశ్వర, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల విగ్రహ పునఃప్రతిష్ట, కుమారస్వామి, దత్తాత్రేయ స్వాముల నూతన విగ్రహ ప్రతిష్ట, శిఖర కలశ ప్రతిష్టాపన మహోత్సవం జరుగుతుందని వెల్లడించారు.

25న 'రాజుగారి గోచి' నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఈనెల 25వ తేదీ సాయంత్రం 7 గంటలకు గుంటూరు కళానికేతన్ వీరన్నపాళెం వారి 'రాజుగారి గోచి' సాంఘిక నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. నాటకాన్ని నారిపెద్ది నారాయణ రచించారని, చిట్టినేని సాయిబాబు దర్శకత్వం వహించారని పేర్కొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియంలో ఈనెల 25వ తేదీ జిల్లా స్థాయి పురుషుల కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ జిల్లా కార్యదర్శి సుభాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కబడ్డీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు 85 కేజీలలోపు బరువు ఉన్న పురుషులు అర్హులన్నారు. అభ్యర్థులు ఆధార్‌కార్డు వెంట తీసుకుని రావాలని తెలిపారు. వివరాలకు 9701012329 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పీఎం సూర్యఘర్‌తో ఉపయుక్తం

కర్నూలు కల్చరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పీఎం సూర్య ఘర్, ముఫ్త్ యోజన పథకంతో ఎంతో ఉపయోగం ఉంటుందని బీజేపీ నేత నగరూరు రాఘవేంద్ర అన్నారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పీఎం సూర్య ఘర్, ముఫ్త్ యోజన పథకంలో భాగంగా రూఫ్ టాప్‌సోలార్ వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. సామాన్య ప్రజలపై విద్యుత్ భారం తగ్గించేందుకు కోటి ఇళ్లకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనున్నారని తెలిపారు. సుస్థిరాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి మరింత ప్రోత్సాహం అందుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గీతా మాధురి, శ్రీరాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు



పగటిపూట వెలుగుతున్న విద్యుత్ దీపాలు

నిర్లక్ష్యం నిండుగా.. అవస్థలు మెండుగా!

- జాతీయ రహదారిపై వెలగని విద్యుత్ దీపాలు
- మూగబోయిన ఎస్‌ఓఎస్ సర్వీసు బాక్సులు
- విద్యుత్ దీపాలు, మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్తం
- పట్టించుకోని టోల్‌ప్లాజా యాజమాన్యం



పనిచేయని సోలార్ బ్లింకర్ లైటు

ఓర్వకల్లు: టోల్‌ప్లాజా యాజమాన్యం నిర్లక్ష్యానికి వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కర్నూలు–కడప జాతీయ రహదారిపై 4 టోల్‌ప్లాజాలు నిర్వహిస్తోంది. ఈ మార్గంలో రోజుకు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వాహనదారుల నుంచి రోజుకు రూ.లక్షల్లో టోల్ వసూలు చేస్తున్నారు. అయితే కనీస సదుపాయాలైన విద్యుత్ దీపాలు, ఎస్‌ఓఎస్ సర్వీస్, మరుగుదొడ్ల నిర్వహణను గాలికొదిలేసిందనే విమర్శలు వస్తున్నాయి.

అస్తవ్యస్తంగా విద్యుత్ దీపాలు

జాతీయ రహదారితో పాటు, రోడ్డుకు ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్ల వెంట వందల సంఖ్యలో విద్యుత్ దీపాలు అమర్చారు. అయితే చాలాచోట్ల విద్యుత్ దీపాలు వెలగడంలేదు. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు లేకపోలేదు. ఓర్వకల్లు మండల పరిధిలోని నన్నూరు టోల్‌ప్లాజా మొదలుకుని టీవీ9 కాలనీ, నన్నూరు అబ్బిదాబా, నన్నూరు సబ్‌స్టేషన్, పూడిచెర్ల మెట్ట, ఓర్వకల్లు పోలీసు స్టేషన్, ఓర్వకల్లు పవర్ గ్రిడ్, తిప్పాయిపల్లె క్రాస్ రోడ్డు, హుసేనాపురం బస్టాండ్, బేతంచెర్ల క్రాస్ రోడ్డు, తమ్మరాజుపల్లె వద్ద కేఎంసీ క్యాంపు, తమ్మరాపల్లె వరకు ఇరువైపులా సుమారు 400 విద్యుత్ దీపాలు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా కాల్వబుగ్గ, హుసేనాపురం సర్వీసు రోడ్లు, నన్నూరు వద్ద ఉన్న విద్యుత్ దీపాలు అరకొరగా వెలుగుతున్నాయి. రాత్రి పూట వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ప్రధాన కూడళ్లలో ప్రమాద సూచికలను తెలియజేసేందుకు అమర్చిన సోలార్ బ్లింకర్ లైట్లు కూడా సక్రమంగా పనిచేయడం లేదు.

అత్యవసర సమయాల్లో కష్టమే!

జాతీయ రహదారిపై ప్రయాణించే ప్రయాణికుల సౌలభ్యం కోసం ప్రతి 200 మీటర్లకు ఒక్కటి చొప్పున సేవ్ అవర్ సోల్ (ఎస్‌ఓఎస్) సర్వీసు బాక్సులు ఏర్పాటు చేశారు. అత్యవసర సమయంలో ఫోన్ చేయడానికి ఈ బాక్సులు ఉపయోగపడతాయి. అయితే ఎక్కడా పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రతి స్టేజీ వద్ద బస్సు షెల్టర్లు నిర్మించాల్సి ఉంది. అయితే నన్నూరు, ఓర్వకల్లు, కొట్టాల, సోమయాజులపల్లె వద్ద మాత్రం షెల్టర్లు నిర్మించారు. అవి కూడా ప్రయాణికులకు అందుబాటులో కాకుండా నిరుపయోగ ప్రదేశాల్లో నిర్మించారు. మిగతా చోట్ల అసలు బస్సు షెల్టర్లు నిర్మించలేదు.

మరుగుదొడ్లు ఉన్నా లేనట్లే..

టోల్ ప్లాజా వద్ద వాహనదారుల సౌకర్యార్థం తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం కల్పించాల్సి ఉంది. అయితే ఇక్కడ కంటైనర్లలో ఏర్పాటు చేసినా నిర్వహణ లోపంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. నన్నూరు అచలాపీఠం దగ్గర నిర్మించిన అండర్ పాస్ వంతెనలో విద్యుత్ దీపాలు పనిచేయకపోవడంతో రాత్రి పూట అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారిందని స్థానికుల చెబుతున్నారు. అలాగే రోడ్డు నిబంధనలు తెలియజేసే డిస్‌ప్లే బోర్డులు కనిపించడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఓర్వకల్లు: బైక్‌పై వెళుతుండగా కుక్క అడ్డు రావడంతో అదుపు తప్పి కిందపడ్డాడు. అదే సమయంలో ఆర్టీసీ బస్సు వేగంగా దూసుకెళ్లడంతో యువకుడు మృతిచెందాడు. ఈ విషాదకర ఘటన ఓర్వకల్లు మండలం నన్నూరు జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల వివరాల మేరకు.. కల్లూరు మండలం, తడకనపల్లె గ్రామానికి చెందిన షేక్ రజాక్ కుమారుడు షేక్ పక్కీర్ సాహెబ్(32) ద్విచక్రవాహనంపై తన భార్య సాహెనాతో కలిసి వ్యక్తిగత పనిపై బనగానపల్లెకు బయలుదేరాడు. మార్గమధ్యలోని నన్నూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద అకస్మాత్తుగా కుక్క అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. అదే సమయంలో కర్నూలు నుంచి నంద్యాల వైపు అతివేగంగా వెళుతున్న ఆర్టీసీ బస్సు పక్కీర్‌సాహెబ్‌పై దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్లెదుటే భర్త మృతి చెందడంతో భార్య గుండెలవిసేలా రోధించింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుని భార్య సాహెనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్ కేవీ సుబ్బయ్యను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

కాలువలో పడి పూజారి మృతి

దేవనకొండ: మండలంలోని గుండ్లకొండ గ్రామంలో ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవానికి వచ్చిన పూజారి నీటమునిగి మృత్యువాత పడ్డాడు. కర్నూలుకు చెందిన పూజారి జశ్వంత్ (25) బృందం బుధవారం గుండ్లకొండలో ఉత్సవం జరిపించేందుకు వచ్చారు. ఉదయం గ్రామ సమీపంలోని హంద్రీ–నీవా కాలువలో స్నానం చేసేందుకు దిగగా ప్రమాదవశాత్తు కాలువలో జారి పడ్డారు. జశ్వంత్‌కు ఈత రాకపోవడంతో కాలువలో మునిగిపోయాడు. మిగతా పూజారులు బయటికి తీసేలోపు జశ్వంత్ ప్రాణాలు కోల్పోయాడు. ఉత్సవం రోజున పూజారి మృత్యువాత పడడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించండి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య, హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని పాణ్యం నియోజకవర్గ ఎన్నికల అధికారి, జేసీ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పాణ్యం నియోజకవర్గానికి చెందిన సెక్టార్, సెక్టార్ పోలీసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఎన్నికల సమయంలో ప్రలోభాలు, గొడవలు, మతపరమైన ఘర్షణలు, ఫిర్యాదులను తీసుకుకోవాలని సూచించారు. ఆయుధాల అప్పగింత, మద్యం సరఫరా, నగదు పట్టివేత, ఎన్నికల నియమాల అతిక్రమణ తదితర విషయాలపై తనకు నివేదించాలని ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాణ్యం, ఓర్వకల్లు, కల్లూరు తహసీల్దార్లు ఫణికుమార్, నటరాజ్, మునివేలు, డీటీలు అనురాధా, గురునాథ్, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం



తెలుగుతల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్ కుమార్, సాయిగోపాల్

కర్నూలు సిటీ: అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని బుధవారం సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో నిర్వహించారు. క్లస్టర్ యూనివర్సిటీ వీసీ డీవీఆర్ సాయి గోపాల్, కాలేజీ ప్రిన్సిపల్ వి.వి.ఎస్ కుమార్ తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిత్యజీవితంలో మాతృభాష ద్వారా మనం అనుకున్న విజయాలు సాధించవచ్చన్నారు. వ్యక్తిత్వ వికాసానికి మాతృభాష కంటే మించిన ఆయుధం లేదన్నారు. శ్రీకృష్ణదేవరాయల వేషంలో విద్యార్థి బాలకృష్ణ, గురజాడ అప్పారావు వేషంలో సందీప్ అలరించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. వైస్ ప్రిన్సిపల్ ఆర్.ప్రసాద్ రెడ్డి, తెలుగుశాఖ అధ్యక్షురాలు ఫామిదా బేగం, తెలుగు అధ్యాపకుడు మల్లయ్య పాల్గొన్నారు.

అవయవదాత కుటుంబానికి ప్రశంసాపత్రం



పావనీలత కుటుంబానికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్

కర్నూలు (టౌన్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అవయవదానం చేసిన పావనీలత కుటుంబాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట రంగారెడ్డి అభినందించారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి జీవన్‌దాన్ ప్రశంసాపత్రాన్ని వారికి అందజేశారు. పావనీలత కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకు వచ్చి నలుగురికి జీవితం ఇచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, పావనీలత తండ్రి ప్రతాప్‌రెడ్డి, అక్క మాధవీలత, దీపక్ రెడ్డి, జీవన్‌దాన్ ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్ సురేష్ కుమార్, అర్షద్‌లు పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులే కారణం

- పోలీస్‌స్టేషన్‌లో మృతురాలి తల్లి ఫిర్యాదు

కర్నూలు (అర్బన్): అదనపు కట్నం తీసుకురావాలని అత్త, మామ, భర్త, మరిది వేధింపుల కారణంగానే తమ కూతురు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం సంజీవనగర్ తాండాకు చెందిన మేఘావత్ రత్నాలు బాయి కర్నూలు మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమ కూతురు శిరీష బాయిని 2023 జూన్ 14న కర్నూలు నగరంలోని గణేష్ నగర్‌కు చెందిన తిరుపాల్ నాయక్ పెద్ద కుమారుడు శ్రీకాంత్ నాయక్‌కు ఇచ్చి వివాహం చేశామన్నారు. భర్త శ్రీకాంత్‌నాయక్, అత్త రుక్మిణి బాయి, మామ తిరుపాల్ నాయక్, మరిది పురేంద్ర నాయక్ అదనపు కట్నం కోసం తన కుమార్తెను మానసికంగా, శారీరకంగా వేధించారని తెలిపింది. ఏడు నెలల గర్భంతో ఉన్న తన కూతురు ఈనెల 21న రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పానీపూరి విక్రేత ఆత్మహత్య

వెల్దుర్తి(కృష్ణగిరి): డోన్‌లో ఉంటూ డోన్, వెల్దుర్తి, ఇతర ప్రాంతాల్లో తోపుడు బండిపై పానీపూరి అమ్ముకునే బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై వెల్దుర్తి ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గోవర్ధనగిరి సమీపంలో రైతు ఈశ్వర్‌రెడ్డికి చెందిన తోటలో బుధవారం ఉదయం మామిడి చెట్టుకు తాడుతో ఉరివేసుకున్న స్థితిలో 13 ఏళ్ల బాలుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెల్దుర్తి ఆసుపత్రికి తరలించారు. మృతుడు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నసీంగా గుర్తించారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి

దేవనకొండ: మండలంలోని బేతపల్లి గ్రామానికి చెందిన బోయ సురేంద్ర (31) పొలం వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. వివరాలు.. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో సురేంద్ర పొలం పనులకు వెళ్లాడు. అక్కడి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు వస్తుండడంతో పరిశీలించేందుకు దగ్గరకు వెళ్లగా స్టే వైరు తగిలడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. సమీపంలోని వారు వెళ్లి చూడగా అప్పటికే సురేంద్ర మృతిచెందినట్లు తండ్రి బోయ మల్లికార్జున తెలిపారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. మృతుడికి భార్య మంజుల, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అనుచరుల ముద్ర వేసి అన్యాయం చేయొద్దు



ఆర్‌ఐకు వినతిపత్రం ఇస్తున్న బాధిత రైతులు

గడివేముల: ఇన్నాళ్లూ విషపు రాతలతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిపై బురద చల్లిన పచ్చ పత్రిక ఇప్పుడు ఏకంగా అమాయక రైతుల జీవితాలతో ఆడుకుంటోంది. ఇందుకు నిదర్శనమే మండలంలోని కొర్రపోలూరు 220 కేవీ విద్యుత్ ఉపకేంద్రం భూనిర్వాసితుల ఆవేదన. వివరాల్లోకెళ్తే... గడివేముల గ్రామానికి చెందిన చెందిన షేక్ రబియాబీ, మహాలక్ష్మి, కొర్రపోలూరు గ్రామానికి చెందిన షేక్ పర్వీన్‌లు సర్వే నంబర్ 11లో విద్యుత్ ఉప కేంద్రానికి భూములు ఇచ్చారు. రైతులు వద్ద ఉన్న భూ రికార్డులను అధికారలు పరిశీలించారు. దీనికి సంబంధించిన పరిహారం త్వరలో వారికి ఖాతాలకు జమ కావాల్సి ఉంది. ఇటీవల పచ్చపత్రిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డిపై రాసిన బూటకపు కథనంలో.. వీరిని ఎమ్మెల్యే అనుచరులుగా చిత్రీకరించి, అక్రమంగా పట్టాలు పొంది ప్రభుత్వానికి అమ్ముకున్నట్లు అవాస్తవాన్ని ప్రచారం చేశారు. దీంతో ఆందోళన చెందిన సదరు బడుగు రైతులు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తమ గోడు వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా మహిళా రైతులు మాట్లాడుతూ.. తాము మూడు దశాబ్దాలకు పైగా సదరు భూముల్లో అనుభవంలో ఉన్నామని, గత ప్రభుత్వం నుంచి పట్టాలు సైతం పొందామని చెప్పుకొచ్చారు. తామంతా ఏ రాజకీయ పార్టీకి, నాయకునికి అనుచరులం కాదని, ఇష్టం వచ్చినట్లు వార్తలు రాసి తమ పొట్ట కొట్టొద్దని విజ్ఞప్తి చేశారు. తమ ఊరికి ఎంతో మంచి చేసిన ఎమ్మెల్యే కాటసానిపై చవకబారు వార్తలు రాయటం బాధ కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు వార్తలతో పరిహారం ఆగిపోతే ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ వెంకటసుబ్బయ్యకు రైతులు వినతి పత్రం అందజేశారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత

- కుడా చైర్మన్ కోట్ల హర్షవర్దన్ రెడ్డి, ఆదిమూలపు సతీష్
- నిడ్జూరులో గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్ ప్రారంభం



సచివాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఆదిమూలపు సతీష్, కోట్ల హర్షవర్దన్ రెడ్డి

కర్నూలు సిటీ: సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఇందులో భాగంగా గ్రామాల్లో పెద్దఎత్తున మౌలిక వసతులను కల్పించారని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. కర్నూలు మండలం నిడ్జూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ సెంటర్‌ను వారు ప్రారంభించారు. ముందుగా గ్రామంలోని శివాలయం, రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సచివాలయం, వలంటీర్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చి పేదల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని తెలిపారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడం కోసం ఆరోగ్య ఉపకేంద్రాలు, రైతుల అభ్యున్నతికి ఆర్‌బీకేల వ్యవస్థను ఏర్పాటు చేసి వ్యవసాయాన్ని పండుగ చేశారని చెప్పారు. అన్ని రంగాల్లో ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్ స్థానంలో ఉందని స్పష్టం చేశారు. అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న గొప్ప నాయకుడు సీఎం జగన్ అని, ఆయనకు అందరూ అండగా నిలవాలని కోరారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు. గత ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని విచ్చలవిడిగా దోపిడీలు చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, ఎంపీడీఓ ఆఫీస్, జెడ్పీటీసీ సభ్యులు ప్రసన్న కుమార్, మౌలాలి, కర్నూలు మండల ఉపాధ్యక్షులు నెహమియా, గార్గేయపురం సింగిల్ విండో చైర్మన్ వినయ్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్ సత్యం రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు మాధవి, విద్యాసాగర్, ఎంపీటీసీ మంజుల, నాయకులు డి.వాసు, మహబూబ్ బాషా, అగ్రికల్చర్ ఏఓలు విశ్వనాథ్, భాస్కర్‌నాయుడు, వైద్యాధికారి విజయ మాధురి, పంచాయతీరాజ్ ఏఈఈ జి.రవి మోహన్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్

సి.బెళగల్: ప్రజా సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం సి.బెళగల్ మండలంంలోని చింతమానుపల్లెలో కుడా నిధులు రూ.8 లక్షలతో నిర్మించిన ఆర్‌ఓ ప్లాంట్‌ను వైఎస్‌ఆర్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, గ్రామ సర్పంచ్ రోజా, మండల నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. అతంకుముందు గ్రామానికి వచ్చిన నేతలకు గ్రామ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్ మాట్లాడుతూ నగరాభివృద్ధి నిధులతో మండలంలోని 10 గ్రామ పంచాయతీలలో మంచినీటి ప్లాంట్లను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించడం జరిగిందన్నారు. డాక్టర్ ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల రోడ్డు నిర్మాణ పనులు త్వరలోనే పూర్తి అవుతాయని తెలిపారు. కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ జన్మదినం వేడుకలు చింతమానుపల్లెలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ నరసింహుడు, పులిరాజు, చిన్నకొండయ్య, కార్యదర్శులు మహానంది, బాయికాటి మద్దిలేటి, ముందరింటి వెంకటేష్, గోపాల్, మండల కోఆప్టెడ్ సభ్యుడు ముల్ల హారున్, మండల నాయకులు రాజశేఖర్‌రెడ్డి, శేశిరెడ్డి, రామచంద్రరెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల కోసం జూడాల ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ డాక్టర్లు

కర్నూలు (టౌన్): పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలను మంజూరు చేయాలని జూనియర్ వైద్యులు డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. గంట పాటు బైఠాయించారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ల సంఘం నాయకులు మెర్సీ, ప్రీతి, తేజేస్, అఖిల్ మాట్లాడుతూ.. ఐదు నెలలుగా తమకు ఉపకార వేతనాలు చెల్లించడం లేదన్నారు. సకాలంలో స్టైఫండ్ అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. వెంటనే చెల్లించాలని కోరారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకట రంగారెడ్డిని కలిసి తమ సమస్యలను విన్నవించారు. స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఉపకార వేతనాల విడుదలకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.